Crime Corner

హుండీ చోరీకి యత్నించిన వ్యక్తి అరెస్టు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-14, నందినగర్ గ్రౌండ్‌లోని ఆలయంలో హుండీ చోరీకి యత్నించిన వ్యక్తిని స్థానికులు పట్టుకుని బంజారాహిల్స్ పోలీసులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే..గురువారం రాత్రి నందినగర్ బస్టాప్ నుంచి నడుచుకుంటూ వెళ్తున్న అనీత్‌కుమార్‌కు ఆలయం నుంచి శబ్దాలు వినిపించాయి. దీంతో అక్కడికి వెళ్లి చూడగా నందినగర్‌కు చెందిన మహ్మద్ రేహాన్ (20) అనే యువకుడు హుండీ పగులగొట్టేందుకు యత్నిస్తున్నట్లు గుర్తించి ఆలయ పెద్దలకు సమాచారం ఇచ్చాడు. దీంతో వారు అతడిని పట్టుకుని బంజారాహిల్స్ పోలీసులకు అప్పగించారు. అనీత్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువతితో అసభ్య ప్రవర్తన..

నిందితుడిపై కేసు నమోదు..

బంజారాహిల్స్: ఓ యువతితో అసభ్యంగా ప్రవర్తిస్తునకన యువకుడిపై బంజారా హిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే..బంజారాహిల్స్ రోడ్డునెంబర్-14లో నివసించే యువతి జూనియర్ రీసెర్చ్ ఆఫీసర్‌గా పనిచేస్తోంది. క్రాంతికుమార్ బోర్లే అనే యువకుడు కొంతకాలంగా ఆమెను వేధిస్తూ అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. గురువారం సాయంత్రం ఆమె నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన క్రాంతి ఆమె చేతులు పట్టుకోవడమే కాకుండా ఇబ్బందులకు గురిచేశాడు. పలు మార్లు తనను అడ్డగించి వేధింపులకు గురిచేశాడని, అతడి నుంచి తనకు భద్రత లేకుండా పోయిందని పేర్కొంటూ బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు క్రాంతికుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లి చేసుకుంటానని నమ్మించి..

- యువతి హత్యకు యత్నం
- నిందితుడిపై కేసు నమోదు

బంజారాహిల్స్: పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఓ యువతిని హత్య చేసేందుకు యత్నించిన వ్యక్తిపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే..శ్రీనగర్‌కాలనీకి చెందిన ఓ యువతి ల్యాబ్‌లో పని చేస్తోంది. శేషు మోహన్ తురగ అనే యువకుడు ప్రేమిస్తున్నాను.. పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆమెతో సహజీవనం చేస్తున్నాడు. ఆమె పెళ్లి చేసుకోవాలని డిమాండ్ చేయడంతో ఇటీవల తల్లిదండ్రుల వద్దకు తీసుకువెళ్లి ఏప్రిల్ 5న పెళ్లి చేసుకుంటానని చెప్పాడు. 5వ తేదీ వారి మధ్య పెళ్లి విషయమై మరోసారి తీవ్ర చర్చ జరిగింది. దీంతో ఆగ్రహానికి లోనైన శేషు మోహన్ ఆమెను తీవ్రంగా కొట్టడమే కాకుండా అసభ్యంగా దూషించాడు. గొంతు నులిమి హత్య చేసేందుకు యత్నించాడు. ఆమె 100 డయల్ చేయడానికి ప్రయత్నించగా ఫోన్ లాక్కున్నాడు. తాను చెప్పినట్లు వినకపోతే చంపుతానని బెదిరించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడు శేషు మోహన్ తురగపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాజుల శ్రీనివాస్‌గౌడ్‌పై పోలీసులకు ఫిర్యాదు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని ఫిలింనగర్ మహనీయుల విగ్రహాల వద్ద ఏర్పాటు చేసిన జ్యోతిబాపూలే దంపతుల విగ్రహావిష్కరణలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను టార్గెట్ చేస్తూ బీసీ సంఘాల నాయకుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ శుక్రవారం ఫిలింనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. శ్రీనివాస్‌గౌడ్ చేసిన వ్యాఖ్యలు అనైతికమని అయన వేదిక పైకి వెళ్లి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అతడికి అంతగా ఉత్సాహం ఉంటే బీసీ కండువా తీసేసి కాంగ్రెస్ కండువా కప్పుకోవాలని హితవు పలికారు.

'బీసీ కులగణనతోనే సామాజిక న్యాయం'

బంజారాహిల్స్: బీసీ కులగణనతోనే సామాజిక న్యాయం, సమగ్రాభివృద్ధి సాధ్యమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. శుక్రవారం డా.బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని సామాజిక సాధికారత ఉత్సవాల్లో భాగంగా ''బీసీ కుల గణన, సాధికారత'' అంశంపై ఉపన్యాసం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణి మాట్లాడుతూ దేశ చరిత్రలో విద్య వికాసానికి తొలి బీజం వేసిన వ్యక్తి మహాత్మా జ్యోతిరావు పూలే అన్నారు. మహనీయుల స్మారకార్థం యూనివర్సిటీలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రధాన వక్తగా హాజరైన ఢిల్లీ విశ్వవిద్యాలయ చరిత్ర విభాగ విశ్రాంత ఆచార్యులు ప్రొ.ఐ తిరుమలి ''బీసీ కుల గణన – సాధికారత'' అంశంపై మాట్లాడుతూ అణగారిన వర్గాలను ఉన్నత స్థాయికి తీసుకొచ్చేందుకు పూలే జాతీయ వాదాన్ని నడిపారన్నారు. దేశంలో సామాజిక న్యాయం, సమ్మిళిత అభివృద్ధిని సాధించడంలో బీసీ కుల గణన కీలకమైన అడుగుగా పేర్కొన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఈ.ఎం.ఆర్.ఆర్.సి డైరెక్టర్ ప్రొ.వడ్డాణం శ్రీనివాస్ మాట్లాడుతూ డా. అంబేద్కర్, మహాత్మా పులే సిద్ధాంతాలు ఆచరణీయమన్నారు. సమాజ అభివృద్ధికి వాళ్ళు చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అకడమిక్ డైరెక్టర్ ప్రొ.జి. పుష్పా చక్రపాణి గౌరవ అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అంతకు ముందు ''మహాత్మా జ్యోతిబా పూలే'' 199వ జయంతి పురస్కరించుకుని శుక్రవారం మహాత్మా జ్యోతిబా పూలే చిత్రపటానికి ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో వీసీ ఆచార్య ఘంటా చక్రపాణి, రిజిస్ట్రార్ డా.ఎల్. విజయ కృష్ణా రెడ్డి; అకడమిక్ డైరెక్టర్ ప్రొ.జి.పుష్పా చక్రపాణి; జి.ఆర్.సి.ఆర్.డి డైరెక్టర్ ప్రొ.ఇ. సుధా రాణి, ప్రొ.వడ్డం శ్రీనివాస్ పాల్గొన్నారు.

శ్రీభవానీ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు..





ఘనంగా భవానీ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ..

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని కమాన్‌లో మిథిలానగర్ రోడ్డులో కొలువుదీరిన శ్రీ భవానీ శంకర, గణపతి, భక్త ఆంజనేయస్వామి సహిత నవగ్రహ ఆలయంలో శుక్రవారం శ్రీ భవానీ (పార్వతి) అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ అంగరంగ వైభవంగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్ఛారణలు, అర్చక స్వాముల పూజలు, భక్తుల జయజయధ్వానాల నడుమ అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. శృంగేరీ పీఠం విజయవాడ ధర్మాధికారి డీవీఎస్ చలపతిరావు నేతృత్వంలో గత మూడు రోజులుగా వేడుకలు జరుగుతున్నాయి. శుక్రవారం ఉదయం ఆవాహనం చేసి విగ్రహానికి ప్రాణ ప్రతిష్ఠ చేశారు. అంతకుముందు పుష్పాధివాసం, జలాధివాసం, క్షీరాధివాసం, ధాన్యాధివాసం తదితర కైంకర్యాలు నిర్వహించారు. సంప్రోక్షణ అనంతరం నవగ్రహ, వాస్తు, ఆదిత్య, ఈశ్వర, గణపతి హోమాలు ఘనంగా జరిగాయి. కలశ స్థాపన అనంతరం కుంభాభిషేకం, యంత్ర ప్రతిష్ఠ నిర్వహించారు. సాయంత్రం శివపార్వతుల కళ్యాణ మహోత్సవం, కుంకుమార్చన పూజలు కన్నుల పండువగా నిర్వహించారు. వేడుకలను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది.

డెండ్రెటిక్ సెల్ థెరపీతో కేన్సర్

వ్యాధిగ్రస్తులకు మంచి ఫలితాలు..

బంజారాహిల్స్: కేన్సర్ మహమ్మారిపై పోరాటంలో మరో ముందడుగు పడిందని స్టెమ్ సెల్స్ రీ జనరేటివ్ అండ్ రీసెర్చ్ ల్యాబ్స్ ప్రతినిధి, రీ జనరేటింగ్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ సదాత్ ఏ అల్ అలీ అన్నారు. శుక్రవారం బంజారాహిల్స్‌లో ఈ తరహా చికిత్సపై ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరీరంలోనే ఉండే డెండ్రెటిక్ కణాలు కేన్సర్‌పై పోరాడే టీ కణాలను ఉత్తేజితం చేస్తాయని, అలాగే మన శరీరంలోని క్యాన్సర్ లేదా బ్యాక్టీరియాకు సంబంధించిన కణాలు ఎక్కడెక్కడ ఉన్నా అన్నింటినీ గుర్తించి నాశనం చేస్తాయన్నారు. ఇది ఒక విధమైన ఇమ్యునో థెరపీ అయినప్పటికీ ఇప్పటివరకు ఉన్న వాటి కంటే భిన్నమైనదన్నారు. మానవ శరీరంలోకి ప్రవేశించిన కేన్సర్ భాగం నుంచి కణాలను తీసుకుని వాటిని కేన్సర్ నయం చేయడానికి వినియోగించే ఈ పద్ధతిపై ఇప్పటికే చేసిన పలు అధ్యయనాలు విజయవంతమైనట్లు తెలిపారు. కేన్సర్‌పై కీమోథెరపీ, మోనోక్లోనల్ యాంటీ బాడీ థెరపీ లాంటివి ఉన్నాయని, వీటన్నింటినీ కూడా డెండ్రెటిక్ సెల్ థెరపీతో కలిపి ఇస్తే కేన్సర్ వ్యాధిగ్రస్తులకు మంచి ఫలితాలు ఉంటాయన్నారు. ఈ తరహా వైద్య చికిత్స వల్ల రోగిలో మూడు నెలల్లోనే కేన్సర్ నయం కావడాన్ని తాము గుర్తించామన్నారు. ఈ సదస్సులో నగరంలోని పలువురు అంకాలజిస్టులు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న డాక్టర్ సదాత్ ఏ అల్ అలీ తదితరులు..

జంట సర్కిళ్లే టాప్

- లక్ష్యాన్ని మించి వసూళ్లు..
- ఆస్తి పన్ను వసూళ్లలో అంకితభావం..
- మొండి బకాయిదారులకు ముచ్చెమటలు..
- అధికారులను అభినందించిన ఉన్నతాధికారులు.
- జంట సర్కిళ్లలో అత్యధికంగా పన్ను వసూళ్లు..
- గ్రేటర్ పరిధిలో సత్తా చాటిన ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ సర్కిళ్లు..



కమిషనర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న జూబ్లీహిల్స్ సర్కిల్ డీసీ సమ్మయ్య

బంజారాహిల్స్: ఆస్తి పన్ను రాబట్టడంలో ఈ సారి జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. గతంలో ఎన్నడూ లేని విధంగా బృందాలుగా ఏర్పడి పన్ను బకాయిలను వసూలు చేయడంలో సత్తా చాటారు. ఏళ్లుగా పేరుకుపోయిన బకాయిలను వసూలు చేసే దిశలో ఆస్తుల జప్తునకు కూడా వెనుకాడలేదు. పన్నులు చెల్లించకుండా ఏళ్ల తరబడి సతాయిస్తున్న ప్రముఖులను కూడా ఈ సారి వదిలిపెట్టకుండా వసూలు చేశారు. జీహెచ్ఎంసీ సర్కిల్-17 పరిధి కిందికి వచ్చే ఖైరతాబాద్, సోమాజీగూడ, సనత్‌నగర్, అమీర్‌పేట డివిజన్ల పరిధిలో 2024-25 ప్రాపర్టీ ట్యాక్స్ వసూళ్ల లక్ష్యానికి మించి ఈ సారి రూ.181 కోట్లు వసూలు చేశారు. గతంలో కంటే ఈ సారి రూ.10 కోట్లు అదనంగా రాబట్టగలిగారు. మొండి బకాయిలను కూడా విడిచిపెట్టకుండా వసూలు చేయడంతో లక్ష్యాన్ని దాటినట్లు ఖైరతాబాద్ సర్కిల్ డీసీ రజనీకాంత్‌రెడ్డి తెలిపారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి చేతుల మీదుగా ఆయన ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్లు, బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లతో కలిసి తన ఆనందాన్ని పంచుకున్నారు. ఈ ఏడాది కూడా లక్ష్యాన్ని చేరుకునేలా పనిచేయాలని సూచించారు.

సర్కిల్-18 పరిధిలో..

జూబ్లీహిల్స్ సర్కిల్-18 పరిధిలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.181 కోట్లు ఆస్తి పన్ను వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా మార్చి 31 నాటికి రూ.191 కోట్లు వసూలు చేశారు. లక్ష్యాన్ని మించి పన్నులు వసూలు చేసిన సర్కిల్-18 ట్యాక్స్ విభాగం అధికారులను జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి ప్రత్యేకంగా అభినందించారు. సర్కిల్-18 డీసీ సమ్మయ్యకు ప్రశంసాపత్రం అందజేశారు. సర్కిల్-18 పరిధిలోని ఏఎంసీలు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు సమన్వయంతో పనిచేసి ఈ సారి గతానికి మించి ట్యాక్స్‌లు రాబట్టగలిగారు. మొండి బకాయిలను పెద్ద ఎత్తున వసూలు చేశారు. ఎంతటి ప్రముఖులైనా విడిచిపెట్టలేదు. ఆస్తుల జప్తునకు కూడా వెనుకాడలేదు. బ్యాంక్‌లు, హోటళ్లను సైతం సీజ్ చేసి పన్నులు చెల్లించిన తర్వాతే వాటిని తెరుచుకోవడానికి అనుమతించారు. సిబ్బంది రేయింబవళ్లు పన్ను వసూళ్లలో నిమగ్నమై అంకితభావంతో పనిచేశారని ఈ సందర్భంగా డీసీ సమ్మయ్య వారందరినీ అభినందించారు. ఈ ఆర్థిక సంవత్సరం కూడా ఇదే సనితీరు కొనసాగించాలని కోరారు.

హిందీ భాషకు ప్రాధాన్యం ఇవ్వాలి

హిమాయత్‌నగర్ : రాష్ట్ర ప్రభుత్వం గత ఫిబ్రవరి 25 నుంచి మాతృభాష తెలుగును తప్పనిసరి చేసిందని, దీనివల్ల వివిధ రాష్ట్రాల నుంచి వచ్చి తెలంగాణలో స్థిరపడిన విద్యార్థులకు తీరని నష్టం జరుగుతుందని జన్‌సేవా సంఘ్ ప్రతినిధులు అన్నారు. ఈ మేరకు శుక్రవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జన్‌సేవా సంఘ్ అధ్యక్షుడు ఆర్‌పీ.సింగ్, ప్రధాన కార్యదర్శి రాజురంజన్ చౌబే, కోశాధికారి వినీత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ ప్రభుత్వం మాతృభాష తెలుగును తప్పనిసరి చేయడం వల్ల సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ తదితర బోర్డు పరీక్షలు రాసే విద్యార్థులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. భాషను ఎంచుకునే స్వేచ్ఛను రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఇవ్వాలన్నారు. బలవంతంగా మాతృభాషను రుద్దడం వల్ల విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశభాష హిందీకి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని కోరారు. హిందీ భాషకు ప్రాధాన్యత ఇస్తే విద్యార్థులకు ఉపయోగంగా ఉంటుందన్నారు. తల్లిదండ్రులకు కూడా ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు గోవింద్ తివారి, ఆరేందర్ చౌబే, ఎస్‌పీ.సింగ్, బసంత్ సింగ్ ఎండి.మునావత్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జన్‌సేవా సంఘ్ ప్రతినిధులు

పార్టీ విజయమే లక్ష్యంగా పని చేయాలి



బీజేపీ జూబ్లీహిల్స్ డివిజన్ క్రియాశీల సభ్యుల సమావేశం

ఫిలింనగర్: ఎన్నికలు ఏవైనా పార్టీ విజయమే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని బీజేపీ నాయకులు అన్నారు. ఈ మేరకు శుక్రవారం సాగర్ సొసైటీ క్యాంప్ కార్యాలయంలో బీజేపీ జూబ్లీహిల్స్ డివిజన్ క్రియాశీల సభ్యుల సమావేశం నిర్వహించారు. బీజేపీ డివిజన్ అధ్యక్షుడు ముద్దంగుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు బంగారం చంద్రశేఖర్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కాడిగారి భోజిరెడ్డి, ఖైరతాబాద్ అసెంబ్లీ కన్వీనర్ గడ్డం వెంకటస్వామిలతో పాటు కొత్త నీరజ, సీతల అనిల్‌కుమార్, దండుగుల శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డివిజన్‌లో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన అంశాలపై చర్చించారు. ఎన్నికలు ఏవైనా బీజేపీ విజయమే లక్ష్యంగా అంకితభావంతో పనిచేయాలని ఈ సందర్భంగా వారు తీర్మానించారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్. బీఆర్ అంబేడ్కర్

బంజారాహిల్స్: డా.బీఆర్. అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో సామాజిక సాధికారత ఉత్సవంలో భాగంగా 'డా. బీఆర్. అంబేడ్కర్: బహుముఖ ప్రజ్ఞాశాలి' అనే అంశంపై మహిళా సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో వక్తలుగా పాల్గొన్న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (ఆంధ్రప్రదేశ్) చరిత్ర విభాగ ఆచార్యులు ప్రొ. చల్లపల్లి స్వరూపా రాణి మాట్లాడుతూ జాతీయ ఉద్యమంలోనూ అణగారిన కులాలను దూరంగా పెట్టారన్నారు. కుల రహిత సమాజానికి వివిధ ప్రాంతాల్లో అనేక మంది సంఘ సంస్కర్తలు కృషి చేసారన్నారు. సామాజిక సమానత్వమే అసలైన స్వతంత్రమని అంబేడ్కర్ పేర్కొన్నారు. రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి విశ్రాంత అదనపు కార్యదర్శి, రచయిత జూపాక సుభద్ర 'అంబేడ్కర్ – హిందూ కోడ్' అనే అంశంపై ప్రసంగించారు. దళిత స్త్రీ శక్తి జాతీయకన్వీనర్ ఝాన్సీ మాట్లాడుతూ రాజ్యాంగ విలువలు క్షీణించాయని, బలమైన రాజ్యాంగం ఉన్నప్పటికీ సరిగా అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. డా. కే. ఎన్. మల్లేశ్వరి మాట్లాడుతూ నాయకు ఆరాధన సరికాదని అంబేడ్కర్ పేర్కొన్నారన్నారు. కేంద్ర సాహిత్య యువ పురస్కార అవార్డు గ్రహీత ఎండ్లూరి మానస మాట్లాడుతూ ప్రస్తుతం దళిత మహిళలు లింగపరంగా, కులపరంగా, ఆర్థికంగా వివక్షను ఎదుర్కొంటున్నారన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన విశ్వవిద్యాలయ అకడమిక్ డైరెక్టర్ ప్రొ.జి.పుష్పా చక్రపాణి; మాట్లాడుతూ డా. అంబేడ్కర్, మహాత్మా పులే సిద్ధాంతాలు ఆచరణీయ మన్నారు.కార్యక్రమంలో విశ్వవిద్యాలయ కళల విభాగ డీన్ ప్రొ.కె.రాణి రజిత మధురి; సికా డైరెక్టర్ ప్రొ. కె. శ్రీదేవి, అన్ని విభాగాల అధిపతులు, డీన్స్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఉద్యోగ సంఘాల నేతలు, విద్యార్థులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: కిలో టమాట రూ.13, నల్లవంకాయ.18, పొడుగువంకాయ.18, బెండకాయ.40, పచ్చిమిర్చి.35, బజ్జిమిర్చి.23, క్యాప్సికం.35, పచ్చికాకరకాయ.35, పందిరిబీర.45, క్యాబేజీ.08, క్యారెట్.17, దొండకాయ.23, గుండు బీన్నీస్.65, గింజచిక్కుడు.55, గోకరకాయ.35, కీర.13, దోసకాయ.18, బీట్‌రూట్.13, ఉల్లిగడ్డ.20, ఆలుగడ్డ.24, చామగడ్డ.35, మొరంగడ్డ.25, కందగడ్డ.45, క్యాలిఫ్లవర్ 18, సొరకాయ.09, పొట్లకాయ.18, ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకూ అమలులో ఉంటాయి.

పెట్రో ధరల పెంపుపై సీపీఎం నిరసన

రహమత్‌నగర్ : పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలకు నిరసనగా సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ఎస్పీఆర్‌హిల్స్‌లో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు స్వామి, శేషగిరిరావు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం రోజురోజుకు ధరలు పెంచుతూ సామాన్యులపై భారం మోపుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు భాగ్య రాజ్, దేవ దాస్, బాలయ్య, సోమ్లా నాయక్, రాజశేఖర్, కురుమయ్య, సమాధానం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూలే జయంతి

ఫిలింనగర్: గొప్పఆలోచనాపరుడు, సంఘ సంస్కర్త, తత్త్వవేత్త మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకలు ఫిలింనగర్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఫిలింనగర్ మహనీయుల చౌరస్తాలో ఏర్పాటు చేసిన పూలే విగ్రహానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించి ఆయన సేవలను కొనియాడారు. సంఘ సంస్కర్త జ్యోతిబాపూలే జీవితం భావితరాలకు ఆదర్శమని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ అన్నారు. మహాత్మా జ్యోతిబాపూలే బడుగు, బలహీన వర్గాల మహిళల అభ్యున్నతికి అలుపెరగని పోరాటం చేసిన యోధుడు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస గౌడ్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి విజయారెడ్డి తదితరులు పాల్గొన్నారు.. కార్యక్రమానికి ఫిలింనగర్ బస్తీల నుంచే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరావ డంతో పండుగ వాతావరణం నెలకొంది.



అభివాదం చేస్తున్న నేతలు



పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న విజయారెడ్డి

గౌతమ్‌నగర్ చౌరస్తాలో..

గౌతమ్‌నగర్ చౌరస్తాలో సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని వివిధ బస్తీల నాయకులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొని ఆయన జాతికి చేసిన సేవలను కొనియాడారు.

అరుంధతి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

బంజారాహిల్స్ రోడ్డునెంబర్-5లోని దేవరకొండ బస్తీ కమ్యూనిటీ హాల్ వద్ద అరుంధతి వెల్ఫేర్ యూత్ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబాపూలే 198వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



సమస్యల పరిష్కారానికి ఇండియన్ బ్యాంక్ ఉద్యోగుల నిరసన

హిమాయత్‌నగర్ : తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఇండియన్ బ్యాంక్ ఉద్యోగులు శుక్రవారం లిబర్టీ ప్లాజాలోని ఇండియన్ బ్యాంక్ ఫీల్డ్ జనరల్ మేనేజర్, జోనల్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్స్(ఎఫ్ఐబీఈయు) పిలుపు మేరకు జంట నగరాల్లో పనిచేస్తున్న ఇండియన్ బ్యాంక్ ఉద్యోగులు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎఫ్ఐబీఈయూ సెక్రటరీ జనరల్ అరుణాచలం, అఖిల భారత బ్యాంక్ ఉద్యోగుల అసోసియేషన్(ఎఐబిఈఏ) జాతీయ కార్యదర్శి బిఎస్.రాంబాబు, ఇండియన్ బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్(ఎపి, టిఎస్) జనరల్ సెక్రటరీ పివి.కృష్ణారావు మాట్లాడుతూ ఇండియన్ బ్యాంక్‌లో ఉన్న సాధారణ పోస్టుల్లో క్లరికల్ స్టాఫ్, సబ్‌స్టాఫ్, స్వీపర్లు, డ్రైవర్లను నియమించాలన్నారు. అలహాబాద్ బ్యాంక్‌ను ఇండియన్ బ్యాంక్ విలీనం చేసిన తర్వాత ఉద్యోగులకు ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌ఫర్ పాలసీని, పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను వెంటనే చేట్టాలన్నారు. బ్యాంకులో పనిచేస్తున్న తాత్కాలిక ఉద్యోగులకు కనీస వేతనాలు, బోనస్ చెల్లించాలన్నారు. బ్యాంకులో ఉన్న శాశ్వత ఖాళీలలో తాత్కాలిక ఉద్యోగుల సేవలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న అన్ని సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 19న అన్ని జోనల్, ఎఫ్‌జిఎం కార్యాలయాల ముందు ధర్నా, ఏప్రిల్ 25న ఒక రోజు సమ్మె నిర్వహించనున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో ఉద్యోగ నియామకాలను కోరుతూ మరిన్ని సమ్మెలకు సిద్ధంగా ఉండాలని సిబ్బందికి పిలుపునిచ్చారు. ఎంఎస్.కుమార్, జి.నల్లప్ప రెడ్డి, జి.పద్మ తదితరులు పాల్గొన్నారు.